కథా కౌముది

# బహురూప

వాణిశ్రీ



## పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం కౌముది నిర్వహించిన కథల పోటీ (2023)లో సాధారణ ప్రచురణ కథ

ఆఫీసుకి రెండో శనివారం, ఆదివారం సెలవులు. సోమవారం సెలవు పెట్టుకుంటే, మంగళవారం, బుధవారం, రెండు రోజులు సంక్రాంతి సెలవులు. గురువారం కనుము పండుగ. ఐచ్ఛిక సెలవు. మళ్ళీ ఆఫీసుకి వచ్చేది శుక్రవారమే. ఎకౌంట్స్ సెక్షన్లో వున్న పదిమంది స్టాఫ్‌లో తొమ్మిది మంది క్యాజువల్ లీవ్‌లెటర్లు పట్టుకుని సూపరింంటెండెంట్ రామాచారిని చుట్టుముట్టారు.

''సంక్రాంతి తెలుగు వారికి పెద్ద పండుగ. నగరంలో పనిచేస్తున్న ఉద్యోగులు మూలాలు పల్లెటూళ్ళలోనే వున్నాయి. వాళ్ళు వెళ్ళక తప్పదు. తను లీవ్ శాంక్షన్ చేయకా తప్పదు. వర్కింగ్ డేస్ రెండు రోజులు సెక్షన్లో ఒక్కరైనా లేకపోతే ఎట్లా?' తల పట్టుకున్నాడు రామాచారి.

''అందరూ వెళ్ళిపోతే ఎట్లా?'' అన్నాడు.

''సార్! రూప లీవ్ పెట్టడం లేదు. సెక్షన్లో తను వుంటుంది'' అన్నది సీనియర్ అసిస్టెంట్ జయలక్ష్మి.

''ఏవమ్మా రూపా వూరెళ్ళడం లేదా?'' అడిగాడు రామాచారి.

''లేదు సార్. నేను వెళ్ళను'' అన్నది రూప.

శేషమణి రూప వైపు జాలిగా చూసింది. పిచ్చిపిల్ల అసలు సెలవేపెట్టదు. ఎక్కడికీ వెళ్ళదు. సీటుకి అతుక్కుపోయి వుంటుంది. వర్క్‌మైండెడ్. పెండింగ్ ఫైల్స్ క్లియర్ చేస్తూ కూర్చుంటుంది.

శుక్రవారం సాయంకాలానికి సెక్షన్ అంతా ఖాళీ అయింది. రూప తప్ప ఎవరూ లేరు. సూపరింటెండెంట్ రూప సీటు దగ్గరికివచ్చి నిల్చున్నాడు. ఆమె సీట్లో నుంచి లేవబోయింది అతను వారించాడు.

''కూర్చో...! కూర్చో ! నేను గూడా లీవ్ పెట్టాను. పండక్కి అల్లుడొస్తున్నాడు. నేను ఇంట్లో లేకపోతే మా ఆవిడ గోల పెడుతుంది. ఇవిగో నా బీరువా కీస్. ఈ రెండు రోజుల్లో బాస్ ఏదైనా ఫైల్ అడిగితే తీసివ్వు'' అంటూ తాళాలు రూప చేతికి అందించాడు.

''ఆఫీసుకి హాలిడేస్ అని అందరికీ తెలుసు కదా సార్. ఎవరొస్తారు?'' అన్నది రూప.

''అమ్మమ్మా! అట్లా అనకు. ఏ కంట్రాక్టరో వస్తాడు. నా ఇ.ఎమ్.డి డిపాజిట్ రాలేదు సార్. నా ఫైనల్ బిల్లు పెండింగ్‌లో వుంది సర్! అని బాస్ దగ్గర కూర్చుంటాడు చెప్పలేం'' అన్నాడు రామాచారి.

'ఎంతయినా అనుభవజ్ఞుడు ముందు చూపు గలవాడు' అనుకుని చిరుమందహాసం చేసింది.

★★★

ఆ రోజు కంట్రాక్టర్ నాగిరెడ్డి వచ్చి రూప సీటు పక్కన స్టూలు మీద కూర్చున్నాడు. అతని పెండింగ్ బిల్లు ఫైలు వెతుకుతోంది రూప.

''అమ్మాయ్! నిన్నెక్కడో చూసినట్టుందే...'' అని కబుర్లు మొదలు పెట్టాడు.

''ఏమో సార్! ఎక్కడ చూశారో?'' అన్నది రూప.

''నిన్ను మా తెనాలిలో చూసినట్టుగా వుంది'' అన్నాడు.

''ఆఁ. చూసే వుంటారు. మాదీ తెనాలే'' అన్నది రూప.

''వెరీగుడ్! మీది తెనాలి మాది తెనాలి...'' అంటూ నాగిరెడ్డి తెనాలి కబుర్లు చెబుతూ పని పూర్తి చేయించుకుని వెళ్ళిపోయాడు నాగిరెడ్డి.

అతను వెళ్ళిన తర్వాత, పక్క సీటులో వున్న శేషమణి అడిగింది.

''మొన్న సీతారామ శాస్త్రితో మాది ఏలూరు అని చెప్పినట్టున్నావే?''

''ఆఁ ఔను మాది ఏలూరే. అశోక్ నగర్'' అన్నది నవ్వుతూ.

శేషమణి అయోమయంగా చూసింది రూపవైపు.

ఆఫీసులో ఎకౌంట్స్ సెక్షన్ సూపరింటెండెంట్ రామాచారి రిటైరయ్యాడు. ఆయన స్థానంలో లక్ష్మీనరసయ్య ట్రాన్సఫర్ మీద వచ్చి చార్జి తీసుకున్నాడు. స్టాఫ్‌కి తన గురించి పరిచయం చేసుకున్నాడు. తను చీరాలలో పుట్టాననీ, తన తండ్రి ఐ.ఎల్.టి.డి. కంపెనీలో పనిచేసేవాడనీ చెప్పాడు. అందరినీ సీటు దగ్గరికి వచ్చి కలుసుకుని కరచాలనం చేశాడు.

ఆయన సీటు దగ్గరికి వచ్చీరాగానే'' సార్! నేను రూప జూనియర్ అసిస్టెంట్‌ని మాదీ చీరాలే'' అన్నది.

పక్క సీట్లో వున్న శేషమణి నోరెళ్ళ బెట్టి చూసింది. రూపకి ఎవరు పరిచయమైనా, వారిది ఏవూరో? తనదీ అదే వూరు అని తడుముకోకుండా చెప్పేస్తుంది.

''రూపా! అసలు మీది ఏవూరు? ఏలూరా? తెనాలా? చీరాలా?" అని అడిగింది శేషమణి.

''అన్నివూర్లు నావే'' అని నవ్వింది రూప.

ఒకరోజు ఆఫీసులో అటెండర్ పెంచలయ్యకు గుండెపోటు వచ్చింది. అంబులెన్స్‌ని పిలవాలని అందరూ హడావుడి చేస్తుండగా రూప బాస్ చాంబర్‌కి వెళ్ళింది.

''సార్! అటెండర్ పెంచలయ్యకు హర్టెటాక్ వచ్చింది. అంబులెన్స్ వచ్చేటప్పటికి లేటవుతుంది. కారులో పంపుదాం.'' అన్నది.

''ఎస్...' అని బాస్ డ్రైవర్ని పిలిచి కారులో పెంచలయ్యకు హాస్పిటల్‌కి తీసుకెళ్ళమని చెప్పాడు. సమయానికి తీసుకెళ్ళడంతో పెంచలయ్య సేవ్ అయ్యాడు. అతనికి బైపాస్ సర్జరీ జరిగింది.

కొన్నిరోజుల తర్వాత శేషమణి రూపని అడిగింది. ''రూపా! పెంచలయ్య ఇంటికి వెళ్ళి పలకరించి వద్దామనుకుంటున్నాను. పాపం మంచివాడు. ఏ పని చెప్పినా వెంటనే చేసేవాడు. నువ్వూ రారాదూ నాకు తోడుగా?''

''అలాగే మేడమ్! అతన్ని ఆసుపత్రిలో చూడ్డమే మళ్ళీ కలవడం కుదరలేదు. మనం వెళ్ళి పలకరిస్తే చాలా సంతోషిస్తాడు'' అన్నది రూప.

ఇద్దరూ ఆదివారం రోజు పెంచలయ్య ఇంటికి వెళ్ళారు. అతని భార్య రంగనాయకమ్మ, పిల్లలు ఆఫీసు వాళ్ళు వచ్చారని సంతోషించారు. స్నాక్స్, కాఫీ యిచ్చి మర్యాద చేశారు. పెంచలయ్యను పరామర్శించాడు. ఇప్పుడు బాగానే వున్నాననీ సిగరెట్లు, మందు మానేశాననీ, మెడికల్ లీవ్ అయిపోగానే ఆఫీసుకి వచ్చి జాయినవుతాననీ కబుర్లు చెప్పాడు. తనకు గుండెపోటు వచ్చినప్పుడు రూప బాస్‌ని అడిగి కారులో ఆసుపత్రికి తీసుకెళ్ళి తనను సేవ చేసినందుకు కృతజ్ఞతలు తెలిపాడు. ఈ మేడమ్ నన్ను ఆసుపత్రిలో చేర్పించింది అని భార్య పిల్లలకు రూప గురించి చెప్పి పొగిడాడు.

''ఈయనకు గుండెపోటు వచ్చినప్పుడు నేను లేనండీ. నెల్లూరు వెళ్ళాను. మా తమ్ముడి కూతురి ఓణీల ఫంక్షన్. మేనత్తను నేను వెళ్ళకపోతే బాగుండదు కదండీ'' అన్నది రంగనాయకమ్మ.

''మీది నెల్లూరా రంగనాయకమ్మగారూ? మాదీ నెల్లూరే'' అన్నది రూప.

శేషమణి రూపవైపు అయోమయంగా చూసింది.

ఇంకేం రంగనాయకమ్మ ముఖం విప్పారింది. తన పుట్టింటి వాళ్ళని చూసినంత సంబరపడింది.

''ఔనా మేడమ్! నెల్లూరులో ఎక్కడ మీ ఇల్లు?'' అని అడిగింది.

''కాపు వీధిలో'' అన్నది రూప.

'కాపు వీధిలో మా మేనమామ కావలి సుబ్బారావు ఇల్లుంది మేడమ్. అక్కడ మా మేనమామకి టైలరింగ్‌షాపుంది. నా చిన్నప్పుడు స్కూలుకి సెలవులిచ్చినప్పుడు మా మావ ఇంట్లోనే వుండేదాన్ని. మా ఇల్లేమో రంగనాయకులపేట.'' నెల్లూరు కబుర్లు మొదలు పెట్టింది రంగనాయకమ్మ.

ఇక వాళ్ళను కదల నివ్వలేదు. భోజనం చేస్తేగాని పోనివ్వనని పట్టుబట్టింది. లంచ్ చేసి బయల్దేరుతూ వుండగా దేవుడి పటం ముందు నిలబెట్టి, బొట్టు పెట్టి,చేతిలో జాకెట్ ముక్క, అరటిపళ్ళు, తమలపాకులు పెట్టి సత్కారం చేసింది.

''గొప్పదానివి రూపా! నీకు కొత్తగా ఎవరు పరిచయమైనా మాదీ మీ వూరే అని చుట్టరికం కలుపుతావు. మాది నెల్లూరే అని నువ్వు చెప్పగానే ఆ రంగనాయకమ్మ ఎంత సంబరపడిపోయిందో? మనం పుట్టింటి నుంచి వచ్చినట్టుగా సంతోషపడిరది'' అన్నది శేషమణి.

''ఔను మేడమ్! మనం ఒక మాటంటే పోయేదేముంది? మన వూరివాళ్ళమే అంటే ఎంతో సంతోషపడిపోతారు. అది పాజిటివ్ థింకింగ్. ఇతరులను సంతోషపెట్టడం కంటే కావాల్సింది ఏముంది?'' అన్నది రూప.

★★★

హనుమంతరావు ట్రాన్స్‌ఫర్ మీద ఆఫీసులో చేరాడు. అతనికి రిలీవ్ అయిన ఆఫీసు నుంచి ఎల్.పి.సి. రాలేదు. లాస్ట్ పే సర్టిఫికెట్ లేకుండా ఇక్కడ ఆఫీసులో అతని జీతభత్యాలు డ్రా చెయ్యడానికి కుదరదు. ఆర్థిక ఇబ్బందుల వలన వడ్డీ వ్యాపారం చేసే అటెండర్ రంగయ్య దగ్గర అప్పు చేశాడు.

రెండు నెలలైనా అప్పు తీర్చకపోయేసరికి రంగయ్య హనుమంతరావుని ఆఫీసు కారిడార్‌లో పట్టుకున్నాడు. డబ్బు ఇస్తావా? చస్తావా? అని కాలర్ పట్టుకుని గుంజుతున్నాడు. తిట్ల దండకం మొదలుపెట్టాడు. హనుమంతరావు బతిమాలే కొద్దీ రెచ్చిపోతున్నాడు.

ఆ సమయంలో రంగప్రవేశం చేసిందిరూప.

''రంగయ్యా! మాటల జాగ్రత్తగదా రానివ్వు. హనుమంతరావుకి ఎవరూ లేరనుకుంటున్నావా? అతనిది మా కాకినాడే..'' అన్నది.

''మీ కాకినాడైతే నాకేందమ్మా? డబ్బులు తీసుకుని రెండు నెలలైంది. వడ్డీ కూడా ఇవ్వడంలేదు. వాడివ్వకపోతే నువ్విస్తావా?'' అన్నాడు రంగయ్య దురుసుగా.

''ఏం తిక్కతిక్కగా వుందా? మర్యాదగా మాట్లాడు వాడు వీడు అంటున్నావే! అతను క్లర్క్ నువ్వు అటెండర్. రేపెప్పుడో అతనితో అవసరం పడొచ్చు. అప్పు తీసుకుంటే ఏమైంది? పారిపోతాడా? పెద్ద గొడవ చేస్తున్నావే! ఎంతివ్వాలో చెప్పు నేనిస్తాను.'' అన్నది రూప.

అన్నట్టే హనుమంతరావు, రంగయ్యకి ఇవ్వాల్సిన డబ్బు గూగుల్ పే చేసింది. హనుమంతరావు కన్నీళ్ళ పర్యంతమయ్యాడు.

''అక్కా! నువ్వు ఆదుకోకపోతే రంగయ్య నా పరువు తీసేసేవాడు. థాంక్స్. జీతం రాగానే డబ్బు యిచ్చేస్తాను.'' అన్నాడు.

''ఫరావలేదు. తమ్ముడూ. తొందరేం లేదు. నీకు వీలున్నప్పుడే ఇవ్వు. ఎవరి దగ్గరా అప్పు తీసుకోకు. నీకు అవసరమైతే నన్ను అడుగు.'' అని అతని భుజం తట్టింది రూప.

''అక్కా! మీది కాకినాడా? ఎక్కడ?'' అని అడిగాడు.

''రామారావు పేటలో'' అన్నది రూప.

''మేము వలస పాకలలో వుంటాం అక్కా!'' అంటూ హనుమంతరావు సంబరపడిపోయాడు.

★★★

ఆ రోజు ఆఫీసులోని ఏకౌంట్స్ సెక్షన్‌లో సందడి నెలకొంది స్టాఫ్ రూప సీటు దగ్గర వచ్చి అభినందనలు తెలియజేస్తున్నారు.

''కంగ్రాచ్యులేషన్స్ రూపా!'' అని కరచాలనం చేస్తున్నారు.

కథల పోటీలో 'అంతా నావాళ్ళే' అనే కథకు ఫస్ట్ ప్రైజ్ ఏభై వేల రూపాయలు వచ్చింది. ఆ వారం పత్రికలో కథ ప్రచురించారు రచయిత్రి 'బహురూప' అని వుంది. బహురూప కథలు గతంలో చాలా వచ్చాయి కాని ఈ సారి బహుమతి గెలుచుకున్నందువలన ఫోటో వేశారు. ఆ ఫోటో రూపది కావడంతో, అందరికీ బహురూప అంటే మన రూపే అని తెలిసింది. అందుకే ఆఫీసులో సందడి. ఏ ఇద్దరు కలిసినా ఈ విషయమే చెప్పుకుంటున్నారు.

ఆ సాయంకాలం ఆఫీస్ అవర్స్ ముగిసిన తర్వాత బాస్ తన చాంబర్ స్టాఫ్‌ని సమావేశపరిచాడు. రూపకు బొయే యిచ్చి, శాలువా కప్పి సత్కరించాడు. స్వీట్లు కూల్‌డ్రింక్స్ తెప్పించాడు.

''నాకు కథలంటే ఇష్టం. ఒక కథ చదివినప్పుడు కొందరు వ్యక్తులు పరిచయమవుతారు. కథలో జరిగిన సంఘటనలు మనల్ని ఆశ్చర్యపరుస్తాయి. కొత్త కొత్త ప్రదేశాలను మనం అక్కడికి వెళ్ళకుండానే సందర్శించగలుగుతాము. నేను బహురూప కథలు పత్రికలలో చాలా చదివాను. ఆ బహురూప మన రూప అని తెలిసి ఆశ్చర్యపోయాను. ఇంతకాలం కలం పేరుతో అజ్ఞాత రచయిత్రిగా వున్న రూప ఇప్పుడు ఫస్ట్ ప్రైజ్ రావడంతో ఒక్కసారిగా వెలుగులోకి వచ్చింది. చాలా సంతోషం. రూప భవిష్యత్తులో మంచి మంచి కథలు రాస్తూ పాఠకులను ఆనందింపజేయాలని కోరుతున్నాను.''

బాస్ మాటలకు అంతా చప్పట్లు కొట్టారు. తర్వాత రూపకు సన్నిహితురాలు శేషమణి మాట్లాడింది.

''రూప గురించి చెప్పాలంటే చాలా వుంది. చిన్న వయసులోనే పరిణతి సాధించింది. బహురూప పేరు సార్ధకం చేసుకుంది. ఆమెకు ఎవరైనా కొత్తగా పరిచయమైతే మీ వూరు మీ వూరే అని చెప్పి వాళ్ళను స్వంతం చేసుకుంటుంది. వాళ్ళను సంతోషపెడుతుంది. మాది గుంటూరు అంటే, మాదీ గుంటూరే అంటుంది. మాది కాకినాడ అంటే కాకినాడ, నెల్లూరంటే నెల్లూరు ఇలా? ఎందుకలా చెప్తున్నావంటే, అది పాజిటివ్ దృక్పథం, ఇతరులను సంతోష పెట్టడమే ఆ విధానం అంటుంది. ఇంతకీ రూప స్వంత ఊరు ఏది? అని అడిగితే చెప్పదు. అన్నీ నా వూళ్లే అంటుంది.

సరే! అదలా వుంచితే, ఆఫీసులో ఎవరికి ఏ ఆపద వచ్చినా ఆదుకుంటుంది. ఏ అవసరం వచ్చినా నేనున్నానని ముందుకు వస్తుంది. రియల్లీ హేట్సాఫ్.

బహురూప అనే కలం పేరు ఎందుకు పెట్టుకుందో గాని నిజంగానే రూప బహురూపే. బహుముఖ ప్రజ్ఞావంతురాలు. రూపది కోకిల కంఠం. సంగీతంలో డిప్లొమా వుంది ఆమెకు. ఇండిపెండెన్సు రోజు జెండా వందనం చేసేటప్పుడు శ్రావ్యంగా జనగణమణ పాడుతుంది. ఇప్పుడు కొత్తగా రూప మరోరూపం రచయిత్రి అని బైట పడింది. రూప మన కొలీగ్ అవడం మనందరికీ గర్వకారణం. బహురూప మా రూపే అని గొప్పగా చెప్పుకుందాం.''

శేషమణి మాటలకు అంతా హర్షధ్వానాలు చేశారు. తర్వాత రూప తన స్పందన తెలియజేసింది. తనకు సత్కారం చేసిన బాస్‌కి, తనను అభినందించిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేసింది.

''నా గురించి శేషమణి మేడమ్ వివరంగా చెప్పారు. మేడమ్‌కి థాంక్స్. నాకు కొత్తగా పరిచయమైన వారితో వారిది ఏ వూరైతే నాదీ అదే వూరు అని చెప్పడం గురించి మేడమ్ నిలదీశారు. నిజం ఎప్పుడూ చెప్పలేదు. ఇప్పుడు చెప్తున్నాను. నాకు స్వంత వూరంటూ లేదు. నా తల్లి నన్ను కని ఆసుపత్రిలో వదిలేసింది. తండ్రి ఎవరో తెలీదు. అనాథను. దిక్కులేని నన్ను ఆసుపత్రికి అనుబంధంగా వున్న అనాథాశ్రమంలో చేర్చారు. ఆశ్రమ నిర్వాహకురాలు మదర్ ఫాతిమా

నన్ను పెంచి పెద్దజేసి చదివించారు. ఆశ్రమంలో వున్న అనాధలను పిల్లలు లేని దంపతులు పెంచుకోవడానికి వస్తుండేవాల్లు. ఐతే వాళ్ళు మగపిల్లలనే దత్తత తీసుకునేవారు. ఆడపిల్లల్ని ఎవరూ తీసుకెళ్ళేవారు కాదు. మాలాంటి అనాధ ఆడపిల్లల్ని మదర్ ఫాతిమా, తను కన్నబిడ్డలవలె సాకింది. ఆమె రుణం జన్మజన్మలకీ తీర్చుకోలేను.

అందుకనే ఏ వూరూ నాదని చెప్పుకోలేని నేను అన్ని వూళ్ళూ నావని భావిస్తాను.

అలాగే అమ్మ, నాన్నా అక్క, అన్న, చెల్లి, తమ్ముడు లేని నేను అందరినీ నా వాళ్ళుగా భావిస్తాను. అందరూ నావాళ్ళే అనుకుంటూ తృప్తిగా జీవిస్తుంటాను. ఈ లోకంలో నాకు పరాయివాళ్ళు ఎవరూ లేరు. అందరూ నావాళ్ళే.''

రూప కంఠం బొంగరు పోయింది. ఆమె వుద్విగ్నురాలైంది. ఎమోషన్ ఆపుకోలేకపోయింది. బోరున ఏడుస్తూ వుంది బహురూప రూప.

★★★

★ ★ ★

# COMMENTS